పండ్ల తోటల రైతులకు పండగే

- ఉపాధి హామీ పథకం ద్వారా భారీ సాయం
- సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు సబ్సిడీ
- ఎకరాకు సరాసరి రూ.లక్షకు పైగా లబ్ధి
- మూడేళ్ల పాటు పంట నిర్వహణ
- 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం


గోకవరం నర్సరీలో పెంచుతున్న మునగ

కొవ్వూరు: ఉద్యాన పంటలను సాగు చేసే చిన్న, సన్నకారు రైతులకు సర్కారు అండగా నిలుస్తోంది. ఉపాధి హామీ పథకం కింద తోటల సాగుకు మూడేళ్ల పాటు సాయం అందిస్తోంది. ఈ పథకంలో నమోదు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులతో పాటు ఐదెకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడీతో పండ్ల సాగుకు తోడ్పాటునిస్తోంది. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 300 ఎకరాల్లో రైతులతో పండ్ల సాగు చేయించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మరో 200 ఎకరాల్లో మునగ సాగుకు చేయూత అందించనున్నారు. ఉద్యాన శాఖలో 15 రకాల వరకూ పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రధానంగా మామిడి, జీడిమామిడి, ఆయిల్‌పామ్, జామ, కొబ్బరి, సీతాఫలం తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

గరిష్ఠంగా ఐదెకరాల వరకూ..

పండ్ల తోటల సాగుకు ఒక్కో రైతుకు గరిష్ఠంగా ఐదెకరాల వరకూ ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీ ఇస్తోంది. రూ.45 విలువైన మామిడి మొక్కను ఎకరాకు 70 చొప్పున, రూ.45 విలువైన 70 జీడిమామిడి మొక్కలు, రూ.40 వంతున 240 సీతాఫలం మొక్కలు, రూ.25 వంతున 110 నిమ్మ మొక్కలను ఉచితంగా అందిస్తున్నారు. ఇతర పండ్ల మొక్కలను కూడా ఉచితంగా అందిస్తున్నారు. గుంత తవ్వడం దగ్గర నుంచి పంటను బట్టి రెండు నుంచి మూడేళ్ల పాటు ఫలసాయం వచ్చేంత వరకూ నిర్వహణ ఖర్చులన్నీ డ్వామా ద్వారా అందిస్తున్నారు. ఉదాహరణకు మామిడి పంటకు ఎకరాకు మూడేళ్లకు రూ.1,02,757 అందిస్తున్నారు. అంటే ఒక్క రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలుంటే రూ.5,13,785 వరకూ లబ్ధి చేకూరుతుంది. జీడిమామిడి పంటపై ఎకరాకు రూ.94 వేలు, నిమ్మ పంటపై రెండేళ్లకు రూ.1,41,520, జామ (తైవాన్) రూ.2,30,023, ఆయిల్‌పామ్‌కు రూ.60 వేలు, సీతాఫలానికి రెండేళ్లు రూ.1,70,603, మునగ పంటకు రూ.1,01,541తో పాటు గులాబీకి రూ.1,92,500, మల్లెపూలకు రూ.1,09,000 చొప్పున రెండేళ్ల పాటు అందిస్తున్నారు. సపోటా సాగుకు ఎకరానికి రూ.88,255, నేరేడుకు రూ.18,124 చొప్పున రెండేళ్లు అందిస్తున్నారు. వేప, గానుగ ఉచితంగా ఇస్తున్నారు.

ఆసక్తి చూపుతున్న రైతులు

ఐదెకరాల లోపు సాగు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు, ఎస్సీ, బీసీ, ఎస్టీ రైతులు ఈ పండ్ల తోటల పెంపకానికి అర్హులు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తోటలు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 264 ఎకరాల్లో గోతులు తవ్వారు. దీనిలో 124 మొక్కలు నాటుకున్నారు. ఈ నెలాఖరుకు 300 ఎకరాల్లో పండ్ల తోటలు వేయడం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాలైన గోకవరం, రంగంపేట, దేవరపల్లి, రాజానగరం, గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి మండలాల్లో పండ్ల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు.


కడియం మండలం జోగురుపాడు నర్సరీలో పెంచుతున్న నేరుడు, వేప, గానుక మొక్కలు

మునగ సాగుకూ సాయం

జిల్లావ్యాప్తంగా 200 ఎకరాల్లో మునగ సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే జిల్లాలోని 40.8 ఎకరాల్లో మునగ పంట వేశారు. దీనిలో అత్యధికంగా గోకవరం మండలంలో 26.3 ఎకరాల్లో, రంగంపేట, నిడదవోలు మండలాల్లో రెండేసి ఎకరాల చొప్పున సీతానగరంలో నాలుగు, గోపాలపురంలో మూడు, కోరుకొండ, బిక్కవోలు, దేవరపల్లి మండలాల్లో ఎకరం చొప్పున, రాజానగరంలో అరెకరంలో పంట వేశారు. కడియం నర్సరీలో 15 వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

మునగతో లాభాలెక్కువ



ఈ ఏడాది 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా నిర్దేశించాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులు త్వరితగతిన పండ్ల తోటలు వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. పంటను బట్టి రెండు నుంచి మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందిస్తున్నాం. జిల్లాలో మరో 200 ఎకరాల్లో మునగ సాగును ప్రోత్సహిస్తున్నాం. ఆరోగ్యానికి మేలు చేసే మునగకు నిర్వహణ ఖర్చులు తక్కువ. ఆదాయం ఎక్కువ వస్తుంది. రైతులకు మొక్కలు అందించడం, గోతులు తవ్వడంతో పాటు ఉపాధి హామీ ద్వారా నిర్వహణ ఖర్చులు ఇస్తున్నాం. నల్లజర్ల మండలంలో ఈ ఏడాది డ్రాగన్ ఫ్రూట్ కూడా పండిస్తున్నాం.

– జీఎస్ రామ్‌గోపాల్, డ్వామా పీడీ

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభం


యర్నగూడెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. యర్నగూడెంలో సుమారు రూ.1.29 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను గురువారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. రూ.42 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాల భవనాలు, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.17 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనం, ఆర్బీకే భవనాలు, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేసినట్టు ఆయన తెలిపారు. దాదాపు 90 శాతం భవనాల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. ఒక్కొక్క గ్రామ సచివాలయానికి రూ.68 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఆయన చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు మండలానికి ఉపాధి నిధులు రూ.60 లక్షలు చొప్పున మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్ బాబు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్ర బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతుల కనకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు గంగవరపు రత్నవళి తదితరులు పాల్గొన్నారు.

రహదారిని ప్రారంభించిన ఎమ్మెల్యే

గోపాలపురం: గోపవరం నుంచి తాళ్లపూడి మండలం గజ్జరం వరకూ అత్యాధునిక జర్మన్ టెక్నాలజీతో నిర్మి ంచిన రెండు లైన్ల రహదారిని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం ప్రారంభించారు. 7.6 కిలో మీటర్ల రోడ్డుకు రూ.12 కోట్లు కేటాయించి జన్మన్ టెక్నాలజీతో నిర్మించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో గడప గడప కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు సీసీరోడ్లు, డ్రైన్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు,ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఎంపీటీసీ మేడ్ని రామచంద్రం,వైఎస్సార్ సీపీ మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, నాయకులు ఎస్‌కె వల్లీ పాల్గొన్నారు.

రైతులకు సాగు పాఠాలు

- జిల్లా వ్యాప్తంగా 30 పొలంబడుల నిర్వహణ
- వ్యవసాయశాఖ జేడీఏ మాధవరావు


అనంతపల్లిలో పొలంబడిలో మాట్లాడుతున్న జేడీఏ మాధవరావు

నల్లజర్ల: సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగుమందులు వినియోగం తదితర అంశాలపై అన్నదాతలను చైతన్యపర్చేందుకు పొలంబడుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ జేడీఏ యస్.మాధవరావు వెల్లడించారు. జిల్లాలో మొట్టమొదటి పొలంబడి కార్యక్రమాన్ని నల్లజర్ల మండలం అనంతపల్లిలో గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 30 చోట్ల ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పొలంలో మంచి వ్యవసాయ పద్ధతులతో పాటు ఆరోగ్యకరమైన పంటలు తీసుకురావడంతో పాటు విత్తనం నుంచి విక్రయం వరకూ ఈ కార్యక్రమంలో ఉంటాయన్నారు. సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్గించడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఒక్కో పొలంబడిలో 30 మంది రైతులు చొప్పున ఎంపిక చేసి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ కార్యక్రమం అమలు చేస్తారన్నారు. 14 వారాల పాటు రైతులకు శిక్షణ అందించడంతో పాటు రైతులకు అందుబాటులో ఉన్న పథకాలు, రాయితీలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంగలకమల కుమారి, ఎంపీపీ బంక జయలక్ష్మి, ఉపసర్పంచ్ కలం సత్యనారాయణ, కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, డీఆర్‌సీ ఏడీఏ కె.జ్యోతిర్మయి, ప్లాంట్‌ప్రొడక్షన్ ఓ.వీరబాబు, డీఆర్‌సీ ఏఓ బి.వెంకన్నబాబు, శాస్త్రవేత్తలు కే.దక్షిణా మూర్తి, డాక్టరు ప్రేమరంజితం, నల్లజర్ల ఏఓ కమల్‌రాజ్, వీఏఏలు దుర్గాసురేష్, జాన్‌పాల్, రైతులు బంక అప్పారావు, వలిరెడ్డి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

చాగల్లు: గర్భిణులు, బాలింతలు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని వైద్యాధికారి ఎం.సౌజన్య అన్నారు. కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాలొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఉండ్రాజవరం: పరిసరాల పరిశుభ్రతను ప్రజలు పాటించాలని తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషారాణి ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫీవర్ సర్వే, వెక్టర్ కంట్రోల్ హైజీన్, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహించవలసిన విధానాన్ని వివరించారు. అనంతరం గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రమణ్యం, హెల్త్ సూపర్‌వైజర్లు సుభాషిణి, జున్నూరి శ్రీనివాసు, ఆరోగ్య కార్యదర్శులు, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

దేవరపల్లి: గౌరీపట్నంలో మనస్థాపానికి గురై బెజవాడ సాయి(20) ఇంటిలో కేబుల్ వైర్‌తో ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గౌరీపట్నానికి చెందిన బెజవాడ సాయికి జనవరిలో వివాహం కుదిరింది. నిశ్చితార్థం అనంతరం నాయనమ్మ మృతి చెందడంతో వివాహం ఆలస్యం అయింది. దీంతో మనస్థాపం చెందిన సాయి గురువారం సాయంత్రం 5 గంటలకు ఇంటిలో కేబుల్ వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ


సగ్గొండ సచివాలయం వద్ద లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


కోరుమామిడిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు


ఖండవల్లిలో జగనన్న సురక్షలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ

గోపాలపురం: ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మరిన్ని సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గోపాలపురం మండలం సగ్గొండ సచివాలయం వద్ద గురువారం సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు యండపల్లి కవిత,ఎంపీటీసీ మేడ్ని రామచంద్రం,ఎస్‌కె ఖాదర్‌వల్లీ, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లి: యర్నగూడెంలోని గ్రామ సచివాలయం-2 వద్ద సర్పంచ్ బొంతా భరత్‌బాబు అధ్యక్షతన గురువారం జరిగిన జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయం పరిధిలో 1960 అర్జీలు రాగా అధికారులు పరిశీలించి పరిష్కరించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ కన్వీనర్ గారపాటి రమాదేవి, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం. రామకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రావళి, నియోజకవర్గ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ వెంకటసతీష్, సర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు పాల్గొన్నారు.

నల్లజర్ల: పుల్లలపాడులో గురువారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీటీసీ వేగిప్రతాప్, పుల్లలపాడు సర్పంచ్ నందమూరి శారదాదేవి, అల్లూరి చినభాస్కరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, కాలిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: సూర్యచంద్రరావుపేటలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలోఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతితిగా పాల్గొని లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు.

జగనన్న సురక్ష.. సామాన్యులకు రక్ష

నిడదవోలు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం సామాన్య ప్రజలకు రక్షణకు నిలుస్తోందని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో 1432 మంది లబ్ధిదారులకు భాగ్యలక్ష్మి, సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్యలు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బయ్యే రాధారాణి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల నాగేశ్వరరావు, వరిగేటి సౌజన్య, సొసైటీ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, తహసీల్దార్ ఎం.గంగరాజు, ఎంపీడీఓ పి.శామ్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో వేలివెన్ను, దమ్మెన్ను గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేలివెన్నులో 600 మంది లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, దమ్మెన్నులో 606 మంది లబ్ధిదారులకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ చేతుల మీదుగా వివిధ రకాల ధృవపత్రాలను అందజేశారు. ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, తహసీల్దార్ జి.కనకరాజు, సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గెద్దం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పట్టణంలో ఎనిమిదో వార్డు ఎన్‌జీవో హోమ్-2 సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 650 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జేఎస్ ఎస్.ఇన్‌చార్జి నగ్గళ్లపాటి శ్రీనివాసరావు, కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే సురక్ష పథకం

పెరవలి: మండలంలోని ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ఖండవల్లిలో 1536, ముక్కామలలో 505 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, మండల పార్టీ అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజకీయ పార్టీలతో ఎస్‌డీసీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మైకేల్ రాజు

గోపాలపురం: నియోజకవర్గంలోని స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఇంటింటా సర్వే నిర్వహించినట్టు ఓఎన్‌జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.మైకేల్ రాజు అన్నారు. గోపాలపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీసీ మైకేల్ రాజు మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో చేపట్టే అంశాలను ఆయా పార్టీ నాయకులకు వివరించారు. దేవరపల్లి తహసీల్దార్ ఎం.రామకృష్ణ, టి.కృష్ణ, నాయకులు పోతిరెడ్డి నాగరాజు, సువర్ణరాజు, సత్యనారాయణ, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

ఉండ్రాజవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం రాజకీయ పక్షాలకు, మధ్యాహ్నం బీఎల్‌వోతో ఓటర్ల జాబితాపై తహసీల్దార్ జి.కనకరాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను గుర్తించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు.

తాళ్లపూడి ఎంఈవో-1గా బాలామణి

కొవ్వూరు(తాళ్లపూడి): తాళ్లపూడి మండల విద్యాశాఖాధికారి-1గా వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని చింతాడ బాలమణి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు విద్యాశాఖ కాకినాడ ప్రాంతీయ సంచాలకులు నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆమె తెలిపారు. ఇక్కడ ఎంఈవోగా పని చేసిన వై.సత్యనారాయణ ఈ నెల రెండో తేదీన నల్లజర్ల బదిలీ అయ్యారు. బాలామణికు పలువురు అభిందనలు తెలిపారు.

ఏపీపీజీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిడదవోలు: ఏపీ ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి నిర్వహించిన ఏపీపీజీసెట్, ఐసీఈటీ పరీక్షల్లో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. విద్యార్థులు కె.వెంకటలక్ష్మి గణితంలో స్టేట్ 168వ ర్యాంక్, పి.జ్యోతిక జువాలజీలో స్టేట్ 180వ ర్యాంక్, ఎస్.సాయికృష్ణ ఎకనామిక్స్‌లో స్టేట్ 96 ర్యాంక్‌లు సాధించారు. ఈ మేరకు గురువారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

నిడదవోలు: ఖరీఫ్‌కు సంబంధించి డెల్టా కాలువలకు సాగునీటి విడుదలను పెంచినట్టు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు తెలిపారు. మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు బుధవారం 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా గురువారం నీటి విడుదలను పెంచుతూ 6,500 క్యూసెక్కులు విడుదల చేశారు. అదే విధంగా తూర్పుడెల్టాకు 4,200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు వదిలిపెట్టారు. పశ్చిమడెల్టాలో పరిధిలో రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాలువలకు కూడా నీటి విడుదలను పెంచుతున్నారు. నరసాపురం కాలువకు 2020 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1048 క్యూసెక్కులు, తణుకు కాలువకు 1106 క్యూసెకులు, అత్తిలి కాలువకు 609 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

చాగల్లు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాశాఖాధికారి ఎం.ఖాదర్‌బాబు అన్నారు. గురువారం మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. నాడు-నేడు పనులు త్వరతగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు ఉండేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

విధ్వంసకారులను అరెస్టు చేయాలి

నిడదవోలు రూరల్: మణిపూర్‌లో విధ్వంసకారులను తక్షణమే అరెస్టు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెద్దం రవీంద్రబాబు డిమాండ్ చేశారు. సమిశ్రగూడెం అరుంధతీయపేట ఎంపీపీ స్కూల్ వద్ద కేఎన్‌పీఎస్ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రవీంద్రబాబు మాట్లాడుతూ ఆదివాసులపై జరుగుతున్న విధ్వంసాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. యు.వెంకట్రావు, కె.రాజు, ఎస్.గోపి, ఎస్.గోతియ్య, ఆర్.సువర్ణరత్నం, ఉందుర్తి కవలమ్మ, సత్యవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న గోదావరి


కొవ్వూరులో గోష్పాదక్షేత్రం వద్ద స్నాన ఘట్టాన్ని ముంచెత్తిన గోదావరి వరదనీరు

కొవ్వూరు: గోదావరి నదిలో వరద పరవళ్లు తొక్కుతోంది. పట్టణంలో గోష్పాదక్షేత్రం స్నానఘట్టం వద్ద దిగువు ఉన్న మెట్ల వరదనీటిలో మునిగిపోయాయి. కొత్త గోదావరి వరద ఉధృతిని తిలకించడానికి అధిక సంఖ్యలో జనం గోష్పాదక్షేత్రానికి తరలివస్తున్నారు. మహిళలు వరదనీటిలో పసుపు, కుంకుమలు చల్లి గోదావరి మాతకు మొక్కుతున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. గోష్పాదక్షేత్రంలో జనం నదిలోకి దిగకుండా పోలీసు గస్తీ కాస్తున్నారు. ఇప్పటికే డీఎల్‌పీవో నదీ తీరంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. అఖండ గోదావరి రివర్ బ్యాంకు అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతి పరిశీలిస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండండి

కొవ్వూరు: గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో నదీతీర ప్రాంతంలోని పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ ఆదేశించారు. తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల్లో నదీతీరం వెంబడి ఉన్న గ్రామాల రేవుల్లో ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. స్నాన ఘట్టాల వద్ద బారికేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నదిలో వరద ఉధృతి అధికంగా ఉన్నందున ఫ్లాష్‌లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి

చాగల్లు: స్థానిక చాగల్లు షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణ ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో మూసివేసిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరుతూ చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకులు గారపాటి సుబ్బారావు మాట్లాడుతూ చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ 1960 లో ఏర్పాటు చేసిన తరువాత ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిదని, అటువంటి ఫ్యాక్టరీ మూతబడడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చెరుకు మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కొఠారు నాగేశ్వరరావు, కొడవటి రాయుడు, కేకే దుర్గారావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంతాపం


మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కొవ్వూరు(తాళ్లపూడి): తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన సంగీతపు సత్యనారాయణ మృతికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సంతాపం తెలియజేశారు. గురువారం మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేశారు. మృతుడు గత 30 ఏళ్ల నుంచి ఎమ్మెల్యేకి చెందిన జీఎస్ రావు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, శీర్ల బ్రహ్మానందం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హలో బీసీ చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మలత, బీసీ నాయకులు

నిడదవోలు: మహిళలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు తదితర డిమాండ్లతో ఈ నెల 24న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ మహిళల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం హలో బీసీ చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. మహిళా బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా, ఉద్యోగాల్లో కూడా 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిని, యువసేన రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏలూరి విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, జేసీఎస్ కనీకవనర్ వెలగన పాలయ్య, కౌన్సిలర్లు బిర్రె పార్వతి, ఆరుగోళ్ల వెంకటేశ్వరరావు, గంగుల గోపియాదవ్, విరమళ్ల త్రిమూర్తులు, పాలా కిరణ్, బిర్రె రామకృష్ణ, తాతా రాంబాబు, మన్నె వెంకట్రావు, రామేశ్వరపు భార్గవి, సలాది వీరలక్ష్మి, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.